ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

కర్ణాటక వార్తలు

సోమవారం 3 జూన్ 2024



నియోజకవర్గం	కౌంటింగ్ కేంద్రం	కౌంటింగ్ హాళ్లు	రౌండ్స్	పోస్టల్ బ్యాలెట్ టేబుళ్లు
చిక్కోడి	ఆర్‌డి పీయూ కాలేజ్	8	22	16
బెళగావి	రాణి పార్వతీదేవి కాలేజ్	8	21	18
బాగల్కోట	హార్టికల్చర్‌సైన్స్ యూనివర్సిటీ	8	20	18
బిజాపూర్	సైనిక్ స్కూల్, విజయపుర	8	22	12
గుల్బర్గా	గుల్బర్గా యూనివర్సిటీ	8	21	5
రాయచూరు	ఎస్ఆర్‌పీఎస్ కళాశాల	8	23	10
బీదర్	బీవీబీ కాలేజ్	13	20	8
కొప్పళ	గవిసిద్ధేశ్వర డిగ్రీ కళాశాల	8	21	8
బళ్లారి	రావ్‌బహద్దూర్ ఇంజనీరింగ్ కాలేజ్	9	19	8
హావేరి	గవర్నమెంట్ ఇంజనీరింగ్ కాలేజ్	8	20	16
ధారవాడ	అగ్రికల్చర్ యూనివర్శిటీ	8	20	7
ఉత్తరకన్నడ	డాక్టర్ ఏవీ బళిగ కాలేజ్	8	23	8
దావణగెరె	దావణగెరె యూనివర్సిటీ	8	19	12
శివమొగ్గ	సహ్యాద్రి ఆర్ట్స్ కళాశాల	15	21	7
ఉడుపి-చిక్కమగళూరు	సెయింట్ సిసిలా కళాశాల ఉడుపి	12	19	5
హాసన్	గవర్నమెంట్ ఇంజనీరింగ్ కాలేజ్	8	24	14
దక్షిణకన్నడ	ఎన్ఐటీ సూరత్కల్ మంగళూరు	8	19	25
చిత్రదుర్గ	గవర్నమెంట్ సైన్స్ కాలేజ్	8	22	12
తుమకూరు	తుమకూరుయూనివర్సిటీ	11	19	19
మండ్య	మండ్య యూనివర్సిటీ	16	20	11
మైసూరు	మహారాణి కామర్స్ కాలేజ్	8	25	25
చామరాజనగర	గవర్నమెంట్ ఇంజనీరింగ్ కాలేజ్	8	21	8
బెంగళూరు గ్రామీణ	ఇంజనీరింగ్ కాలేజ్, రామనగర	16	22	14
బెంగళూరు ఉత్తర	సెయింట్ జోసెఫ్‌స్కూల్, మల్యరోడ్	15	34	8
బెంగళూరు సెంట్రల్	మౌంట్‌కార్మెల్, వసంతనగర్	9	25	9
బెంగళూరు సౌత్	ఎస్ఎస్ఎంఆర్‌వి కాలేజ్ జయనగర్	8	28	4
చిక్కబళ్లాపుర	నాగార్జున ఇంజనీరింగ్ కళాశాల	9	30	9
కోలారు	గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్	15	21	8

కౌంటింగ్‌కు సర్వం సిద్ధం

● ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు ● 28 జిల్లాల్లోనూ భారీ బందోబస్తు



మౌంట్‌కార్మెల్ కళాశాల కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న బీబీఎంపీ కమిషనర్ తుషార్‌గిరినాథ్



కంట్రోల్ విభాగం రూం పరిశీలన




బెంగళూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తయ్యాయి. 28 లోక్‌సభ స్థానాల కౌంటింగ్‌ను 28 ప్రాంతాల్లో నిర్వహించనున్నారు. ఓట్ల లెక్కింపునకు కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. మరో 24 గంటల్లో ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుంది. కొన్ని గంటల వ్యవధిలోనే ఫలితాలు బహిర్గతం కానున్నాయి. రాష్ట్ర ఎన్నికల అధికారి మనోజ్‌కుమార్ మీనా మరోసారి సమీక్ష నిర్వహించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో ఎక్కడా సమస్య తలెత్తరాదని సూచించారు. ప్రతి కౌంటింగ్ కేంద్రానికి ఎన్నికల కమిషన్ నుంచి అబ్జర్వర్లు పర్యవేక్షణ చేస్తారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ నుంచి ఇప్పటికే అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. సురపుర అసెంబ్లీ స్థానానికి జరిగిన ఎన్నికల కౌంటింగ్ ప్రభుత్వ బాలికల పీయూ కళాశాల యాదగిరిలో జరగనుంది. మొత్తం 14 టేబుళ్లు, 23 రౌండ్లు ఉంటాయి. లోక్‌సభ ఓట్ల లెక్కింపు జరిగే కేంద్రాల వివరాలిలా ఉన్నాయి.

రేపు నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు

బెంగళూరు నగరంలో మూడు చోట్ల ఓట్ల లెక్కింపు నిర్వహిస్తున్నందున ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. మంగళవారం ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగనుంది. బెంగళూరు సెంట్రల్ స్థానానికి సంబంధించిన ఓట్ల లెక్కింపు విఠల్‌మల్యరోడ్డులోని సెయింట్‌జోసెఫ్ కళాశాలలోనూ, బెంగళూరు ఉత్తర నియోజకవర్గ ఓట్ల లెక్కింపు వసంతనగర్‌లోని మౌంట్‌కార్మెల్ కళాశాలలో జరగనుంది. దీంతో ప్యాలెస్ రోడ్డు, చంద్రికా జంక్షన్ రోడ్డు, జయమహల్ రోడ్డు, విఠల్‌మల్యా రోడ్డులో ట్రాఫిక్ ఆంక్షలు విధించనున్నారు. అందుకు ప్రత్యామ్నాయంగా రవాణా ఏర్పాట్లు చేశారు. జయనగర్ 4వ బ్లాక్‌లోని ఎస్ఎస్ఆర్‌వీ కళాశాలలో బెంగళూరు దక్షిణ నియోజకవర్గం ఓట్ల లెక్కింపు కొనసాగనుండడంతో జయనగర్ పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.

కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించిన అధికారులు

లోక్‌సభ ఓట్ల లెక్కింపునకు సంబంధించి ఏర్పాట్లు చేసిన కేంద్రాలను ఆదివారం ఎన్నికల ముఖ్య అధికారులు పరిశీలించారు. ఆదివారం జిల్లా ఎన్నికల అధికారిగా ఉన్న బీబీఎంపీ కమిషనర్ తుషార్‌గిరినాథ్ మౌంట్ కార్మెల్‌లో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఎన్నికల అధికారులు డాక్టర్ కె. హరీశ్‌కుమార్, దయానంద్, వినూత్‌కుమార్ ఉన్నారు.



భోసరాజు



ఐవాన్ డిసౌజా



గోవిందరాజు



యతీంద్ర




జగదేవ్ గుత్తేదార్



ఎ.వసంత్ కుమార్



బసనగౌడ బాదర్లి



పరిషత్‌కు అభ్యర్థుల ఖరారు

● ఎగువసభకు సీఎం తనయుడు యతీంద్ర ● మరోసారి భోసరాజు, గోవిందరాజుకు అవకాశం ● ఏడుగురి పేర్లు ఖరారు చేసిన కాంగ్రెస్

బెంగళూరు/రాయచూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యేల కోటాలో విధానపరిషత్ సభ్యులను ఎన్నుకునేందుకు కాంగ్రెస్, బీజేపీ ఇరు పార్టీలూ తమ అభ్యర్థులను ఒకే రోజు ప్రకటించాయి. తమ బలాబలాలను బట్టి అభ్యర్థులను ఖరారు చేశాయి. కాంగ్రెస్ పార్టీ ఏడుగురు అభ్యర్థులను ఆదివారం ప్రకటించింది. ముఖ్యమంత్రి సిద్దరామయ్య కుమారుడు యతీంద్రకు ఎగువసభలో చోటు దక్కింది. పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సూచన మేరకు పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ జాబితాను విడుదల చేశారు. విధానపరిషత్ సభా నాయకుడిగా మంత్రిగా వ్యవహరిస్తున్న ఎన్ఎస్ బోసరాజు, వసంతకుమార్, సీఎం రాజకీయ కార్యదర్శి కె. గోవిందరాజు, మాజీ ఎమ్మెల్సీ ఐవాన్ డిసౌజా, కలబురగికి చెందిన జగదేవ్ గుత్తేదార్‌తో పాటు బెంగళూరుకు చెందిన బిల్కిస్‌బానోను అభ్యర్థులుగా ప్రకటించారు. మరో స్థానానికి త్వరలో జరిగే ఎన్నికలకు గాను బసనగౌడ బాదర్లి పేరును ఖరారు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఆచితూచి అభ్యర్థులను ఖరారు చేసింది. సీఎం సిద్దరామయ్య కుమారుడు యతీంద్రతోపాటు ఆప్తుడైన గోవిందరాజులను అభ్యర్థులను చేశారు. వరుణ శాసనసభ నియోజకవర్గాన్ని తండ్రి సిద్దరామయ్యకు త్యాగం చేశారు. అప్పట్లోనే యతీంద్రను పరిషత్ సభ్యుడు చేసేలా హామీ ఇచ్చారు. ఇటీవల లోక్‌సభ ఎన్నికల వేళ యతీంద్ర పేరు వినిపించింది. అయితే అనూహ్యంగా పార్టీ అధికార ప్రతినిధి లక్ష్మణ్‌కు టిక్కెట్ దక్కింది. గతంలో ఎమ్మెల్సీగా వ్యవహరించిన ఐవాన్ డిసౌజాకు మరోసారి అవకాశం దక్కింది. కాగా రాయచూరు జిల్లాకు చెందిన వారే ముగ్గురు ఉండడం గమనార్హం. జిల్లాకు చెందిన మంత్రి ఎన్ఎస్ బోసరాజుతో పాటు మరో ఇద్దరు సీనియర్ నాయకులు ఎ.వసంత్ కుమార్, బసనగౌడ బాదర్లి ఉన్నారు. జగదీశ్ శెట్టర్ రాజీనామాతో ఏర్పడిన ఖాళీ స్థానానికి పార్టీకి చెందిన బసనగౌడ బాదర్లి పేరును ఖరారు చేశారు.

ముగ్గురి పేర్లు ప్రకటించిన బీజేపీ

● సీటీ రవి, ఎన్.రవికుమార్, ఎంజీ మూలెకు అవకాశం

బెంగళూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యేల కోటా నుంచి విధానపరిషత్ సభ్యులను ఎన్నుకునేందుకు జరుగుతున్న ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులను బీజేపీ అధిష్ఠానం ప్రకటించింది. పార్టీ సీనియర్ నేత సీటీ రవి, పార్టీ రాష్ట్రప్రధాన కార్యదర్శి ఎన్. రవి కుమార్, కర్ణాటక మరాఠా అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే మూలె పేరు ఖరారు చేశారు. 11 స్థానాలకు నోటిఫికేషన్ జారీ చేయగా శాసనసభలో ఎమ్మెల్యేల కోటా ప్రకారం కాంగ్రెస్‌కు 7, బీజేపీకి 3, జేడీఎస్‌కు 1 స్థానం దక్కనున్నాయి. ఎంపీ సీటును త్యాగం చేసిన సుమలతకు దక్కుతుందని ప్రచారం సాగింది. శనివారం బీజేపీ రాష్ట్ర నాయకులు ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అధిష్ఠానం సుమలత పేరును పక్కనపెట్టింది. గతంలో ఎమ్మెల్యేగాను తమిళనాడు, పాండిచ్చేరి రాష్ట్రాలకు బీజేపీ ఇన్‌చార్జ్‌గా వ్యవహరించడమే కాకుండా జాతీయ కమిటీలో కార్యదర్శిగా అనుభవం ఉన్న సీటీ రవి పేరు ఖరారు చేశారు. ఇటీవల ఎంపీ ఎన్నికల్లో చిక్కమగళూరు నుంచి పోటీ చేయాలని ప్రయత్నించారు. సిట్టింగ్ ఎంపీ, కేంద్రమంత్రి శోభాకరంద్లాజెకు వ్యతిరేకంగా ఈయన వర్గీయులు ఆందోళన కూడా చేశారు. ఎంపీ టిక్కెట్‌కు మొండి చేయి చూపిన అధిష్ఠానం ప్రస్తుతం ఎమ్మెల్సీతో సరిపెట్టింది. ఇక రాష్ట్ర పార్టీలో ఐదేళ్లుగా కీలకంగా వ్యవహరిస్తున్న ఎన్. రవికుమార్‌కు మరోసారి అవకాశం ఇచ్చారు. పరిషత్‌లో ప్రతిపక్షహోదా సీటీ రవి లేదా రవికుమార్‌కు దక్కే అవకాశం ఉంది. ఇక రాష్ట్రంలోని సరిహద్దు జిల్లాలు బెళగావి, బాగల్కోటె, ఉత్తరకన్నడ జిల్లాల్లో మరాఠాల ప్రభావం ఎక్కువగా ఉంది. ఆ వర్గీయులంతా సుదీర్ఘంగా బీజేపీకి అండగా ఉన్నారు. మరాఠాల మద్దతు మరింత బలోపేతం చేసుకునేందుకు నిర్ణయించిన బీజేపీ అధిష్ఠానం మాజీ ఎమ్మెల్యే ఎంజీ మూలెకు పరిషత్ టిక్కెట్ ఖరారు చేసింది.



బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులు సీటీ రవి, ఎన్.రవికుమార్, ఎంజీ మూలె

ఎగ్జిట్‌పోల్స్‌తో కాంగ్రెస్‌లో కలవరం

● మంత్రి పదవులు కోల్పోతామనే భయం ● వారసుల భవితవ్యంపై ఆందోళన

బెంగళూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): శాసనసభ ఎన్నికల తరహాలోనే లోక్‌సభ బరిలోనూ అత్యధిక సీట్లు గెలుస్తామనే ధీమాలో ఉన్న రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నేతలకు ఎగ్జిట్‌పోల్స్ కలవరపెట్టాయి. లోక్‌సభ ఎన్నికల్లో కనీసం 15-20 స్థానాలు గెలుపొందుతామని పలు సందర్భాల్లో ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రకటించారు. ఇక డీసీఎం, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డీకే శివకుమార్ మరో అడుగు ముందుకేసి 20 స్థానాలు దాటుతామని ధీమా వ్యక్తం చేస్తూ వచ్చారు. శనివారం ప్రకటించిన ఎగ్జిట్‌పోల్స్‌లో కాంగ్రెస్‌కు సింగిల్ డిజిట్ నెంబరుకే పరిమితం చేశారు. దాదాపు 15-20కు పైగా సర్వే సంస్థలు ఎగ్జిట్‌పోల్స్‌ను ప్రకటించాయి. ఏ సంస్థ సర్వేలోనూ 8 స్థానాలకు మించలేదు. ఎగ్జిట్‌పోల్స్‌పై ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పందించారు. వాటితో ఏకీభవించేది లేదని, కనీసం డబుల్ డిజిట్‌కు ఢోకా లేదని ధీమా వ్యక్తం చేశారు. ఎగ్జిట్‌పోల్స్ విడుదలయ్యాక రాష్ట్ర కాంగ్రెస్‌లో అయోమయం ఆరంభమైంది. రాష్ట్ర పార్టీలో అంతా సవ్యంగా ఉందని కలసికట్టుగా ఉన్నామని బహిరంగంగా అందరికీ కనిపించేలా వ్యవహరిస్తున్న సీఎం, డీసీఎం తీరులో ఎవరికివారు అవకాశాలను సద్వినియోగం చేసుకునేందుకు ప్రయత్నాల్లో ఉన్నారని తెలుస్తోంది. సీఎం పదవి కోసం ఏడాది కిందట ఇద్దరూ పోటీ పడగా స్వయంగా సోనియాగాంధీ, ప్రియాంకగాంధీ ఒక రాజీ ఫార్ములా సూచించడంతో సమస్య సద్దుమణిగింది. అందుకే డీకే శివకుమార్‌కు పార్టీ అధ్యక్ష పదవితోపాటు బెంగళూరు నగరాభివృద్ధి, కీలకమైన జలవనరులశాఖలు అప్పగించారు. వీటితోపాటు డీసీఎం హోదా కూడా ఇచ్చారు. ఇలా డీకే శివకుమార్‌కు నాలుగు కీలకమైన హోదాలు ఉన్నాయి. ఇక లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి ఇద్దరూ వ్యూహాత్మకంగానే వ్యవహరిస్తూ వచ్చారు. ఏకంగా పది మంది మంత్రులకు లోక్‌సభ టిక్కెట్‌లు ఇచ్చేలా డీకే శివకుమార్ ప్రతిపాదన పెట్టారు. అందుకు సిద్దరామయ్య అభ్యంతరం పెట్టడం అధిష్ఠానం కూడా ససేమిరా అనడంతో మంత్రులు అభ్యర్థులు కాలేదు. జిల్లా ఇన్‌చార్జ్‌మంత్రులకు కీలకమైన బాధ్యతలు అప్పగించారు.

మంత్రి హోదా గల్లంతేనా?

జిల్లా ఇన్‌చార్జ్ మంత్రులను బాధ్యులను చేస్తూ మీరే అభ్యర్థులను ఖరారు చేయాలని గెలుపు విషయంలోనూ అంతా మీదే అంటూ అధిష్ఠానం స్పష్టం చేసింది. దీంతో ఇతరుల కోసం పనిచేయడంతోపాటు సౌలభ్యాలు భరించడం కంటే వారసులను రాజకీయంగా బ్రాండింగ్ చేసుకుందామని దాదాపు పదిమంది దాకా మంత్రులు వ్యవహరించారు. కుమార్తెలు, కుమారులు, భార్య, అక్కాచెల్లెళ్లకు టిక్కెట్లు ఇప్పించుకున్నారు. గెలుపొందితే తమకంటే ముందు జాతీయ రాజకీయాల్లోకి వెళ్తారని మంత్రులు భావించారు. ఎగ్జిట్‌పోల్స్‌తో పలువురు మంత్రులకు అప్పుడే భయం పట్టుకుంది. ఎన్నికల్లో అభ్యర్థులు ఓడితే మంత్రులు బాధ్యత తీసుకోవాలని పదవిని కోల్పోవాల్సి ఉంటుందని ముందుగానే సూచించారు. దీన్నిబట్టి వారసులకు టిక్కెట్లు ఇప్పించుకున్నమంత్రులు డోలాయమానంలో పడ్డారు. అదే జరిగితే రాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులు తథ్యమనిపిస్తోంది. ఓవైపు లోక్‌సభలో ఓటమితో దిగాలు చెందే పరిస్థితి ఉండగా మరోవైపు మంత్రి పదవులు కోల్పోవాల్సి వస్తే అసంతృప్తి రగిలే అవకాశం ఉంది. లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత రాష్ట్ర రాజకీయాల్లో సంచలనాలు చోటు చేసుకోనున్నాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.



నేడు ఆరు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు

● 307 పోలింగ్ కేంద్రాలు ● 78 మంది అభ్యర్థులు




బెంగళూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): విధాన పరిషత్‌లోని మూడు పట్టభద్రులు, మూడు ఉపాధ్యాయ నియోజకవర్గాలకు పోలింగ్ నిర్వహించేందుకు సర్వం సిద్ధమైంది. సోమవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఆదివారం అన్ని పోలింగ్ స్టేషన్లకు సామగ్రిని తరలించారు. ఆరు ఎమ్మెల్సీ స్థానాలకు 78 మంది అభ్యర్థులు బరిలో ఉండగా 307 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. కర్ణాటక ఈశాన్య పట్టభద్రుల స్థానంలో 19 మంది అభ్యర్థులు ఉండగా 1,56,623 మంది ఓటర్లు ఉన్నారు. చంద్రశేఖర్ పాటిల్, అమరనాథ పాటిల్, ఎన్.ప్రతాప్‌రెడ్డి ప్రధాన అభ్యర్థులుగా ఉన్నారు. కలబురగి, బీదర్, రాయచూరు, కొప్పళ, బీదర్, రాయచూరు, బళ్లారి, యాదగిరి, విజయనగర జిల్లాల పరిధిలో 41 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. వీటిలో 26 మంది కాంగ్రెస్, 10 మంది బీజేపీ, జేడీఎస్‌కు చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలు, ఇద్దరు స్వతంత్రులు ఉండడంతో కాంగ్రెస్‌కు చెందిన చంద్రశేఖర్‌పాటిల్ భారీ మద్దతు లభిస్తుందనే ఆశతో ఉన్నారు. బెంగళూరు పట్టభద్రుల స్థానానికి 15మంది అభ్యర్థులు బరిలో ఉండగా బెంగళూరు నగర జిల్లాలతోపాటు బెంగళూరు గ్రామీణ, రామనగర జిల్లాలు ముఖ్యమైనవి. బీజేపీ నుంచి ఆర్. దేవెగౌడ, కాంగ్రెస్ నుంచి రామోజిగౌడ ప్రధాన అభ్యర్థులుగా ఉన్నారు. 1,21,860 మంది ఓటర్లు కాగా 159 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. కర్ణాటక నైరుతి పట్టభద్రుల నియోజకవర్గంలో 15 మంది అభ్యర్థులు పోటీ చేస్తుండగా కాంగ్రెస్ నుంచి మాజీ ఎమ్మెల్సీ ఆయనూరు మంజునాథ్, బీజేపీ నుంచి డాక్టర్ ధనంజయ్ సర్జి బరిలో ఉన్నారు. బీజేపీ మాజీ ఎమ్మెల్యే రఘుపతి భట్ స్వతంత్రంగా బరిలో ఉండడంతో ఎన్నిక ప్రతిష్ఠాత్మకమైంది. గడిచిన రెండు ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి ఓడిన ఎస్‌పీ దినేశ్ మరోసారి స్వతంత్ర అభ్యర్థిగా పోటీలో ఉన్నారు. గతంలో ఇదే స్థానం నుంచి 1988 నుంచి 2012 వరకు ఐదుసార్లు డీహెచ్ శంకరమూర్తి ప్రాతినిథ్యం వహించారు. విధానపరిషత్ సభాపతిగా ఆయన సుదీర్ఘకాలం కొనసాగారు. 85,090 మంది ఓటర్లు ఉండగా 76 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. దక్షిణ ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి 11 మంది అభ్యర్థులు పోటీలో ఉండగా జేడీఎస్‌లో ఎమ్మెల్సీగా కొనసాగి ఇటీవలే కాంగ్రెస్‌లో చేరిన మరితిబ్బేగౌడ అభ్యర్థి అయ్యారు. గతంలో నాలుగుసార్లు మరితిబ్బేగౌడ ఎమ్మెల్సీగా గెలుపొందారు. ప్రస్తుతం జేడీఎస్, బీజేపీ అభ్యర్థిగా వివేకానంద బరిలో ఉన్నారు. కన్నడ పోరాటనేత వాటాళ్‌నాగరాజ్ బరిలో ఉండడం ప్రత్యేకం. 21,549 మంది అభ్యర్థులు కాగా 42 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. నైరుతి ఉపాధ్యాయ నియోజకవర్గంలో 8 మంది అభ్యర్థులు ఉన్నారు. ప్రధానంగా బీజేపీ-జేడీఎస్ ఉమ్మడి అభ్యర్థి సిట్టింగ్ ఎమ్మెల్సీ బోజేగౌడ పోటీ చేస్తున్నారు. అంతకుముందు రెండుసార్లు కెప్టెన్ గణేశ్‌కార్నిక్ బీజేపీ తరపున ఎమ్మెల్సీగా వ్యవహరించారు. 23,402 మంది ఓటర్లు కాగా 79 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఇక ఆగ్నేయ ఉపాధ్యాయ నియోజకవర్గంలో 15 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. 25,309 మంది ఓటర్లు కాగా 47 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. బీజేపీ నుంచి వైఏ నారాయణస్వామి, కాంగ్రెస్ నుంచి డీటీ శ్రీనివాస్ బరిలో ఉన్నారు. వీరిద్దరి మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. 2006, 2012, 2018 ఎన్నికల్లో వైఏ నారాయణస్వామి గెలుపొందారు. మరోసారి ఆయన తన అదృష్టాన్ని పరీక్షించుకోదలిచారు. డీటీ శ్రీనివాస్ గత ఎన్నికల్లోనూ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశారు. అప్పట్లో ఆయన బీజేపీ టిక్కెట్ ఆశించగా దక్కకపోవడంతో ఇండిపెండెంట్‌గా బరిలోకి దిగారు. నారాయణస్వామి ఉపాధ్యాయ నియోజకవర్గంలో సుదీర్ఘకాలంగా గెలుపొందేందుకు ముఖ్యకారణం ఆయన ఉపాధ్యాయ సమస్యలపై నిరంతరంగా పోరాటం చేయడమేనని తెలుస్తోంది. ఐదు జిల్లాలు నియోజకవర్గ పరిధిలో ఉన్నాయి.



సీఎల్పీ సమావేశంలో సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్

ఎమ్మెల్సీ ఎన్నికలపై సీఎల్పీ సమావేశం

బెంగళూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ (సీఎల్పీ) సమావేశం ఆదివారం జరిగింది. పార్టీ సభ్యులు పాటించాల్సిన అంశాలపై చర్చించారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్, హెచ్‌కే పాటిల్ తదితరులు పాల్గొన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,577.47	1,580.70
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	411	807
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	25	248
సామర్థ్యం (టీఎంసీలు)	3.36	4.82

మంచి విత్తనాలు అందేలా చూడాలి



మొక్కకు నీరు పోసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

బళ్లారి సిటీ, జూన్ 2: రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందించాలని వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు తిరుమలేశ్ అన్నారు. నగరంలోని బీడీఏఏ హాల్లో బళ్లారి, కురుగోడు తాలూకాలకు చెందిన వ్యవసాయ పనిముట్ల విక్రయదారులతో శనివారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. అధబూకృత కంపెనీల వ్యవసాయ పనిముట్లను మాత్రమే విక్రయించాలని, నిర్ణీత ధర కంటే ఎక్కువ ధరకు విక్రయించరాదని, నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విక్రయాలకే పరిమితం కాకుండా రైతులకు వ్యవసాయ సమాచార కేంద్రంగా వ్యవహరించాలని సూచించారు. వ్యవసాయ పనిముట్లను విక్రయించేవారు విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల చట్టం నిబంధపల ప్రకారం పనిచేయాలని వ్యవసాయ సహాయ సంచాలకులు ముజీబుర్ రెహమాన్ పేర్కొన్నారు. ఈసందర్భంగా వ్యవసాయ ఉపసంచాలకులు కెంగెగౌడ, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు దయానంద, కే.నాగరాజు, జిల్లాలోని వ్యవసాయ పరికరాల విక్రయదారులు పాల్గొన్నారు

వైద్యాధికారిపై కలెక్టర్ ఆగ్రహం



ఆస్పత్రిని తనిఖీచేస్తున్న జిల్లా అధికారి ప్రశాంత్ కుమార్

సిరుగుప్ప, జూన్ 2: ప్రభుత్వాస్పత్రి మౌళిక సదుపాయాలపై నిర్లక్ష్యం వహించిన డాక్టర్ గురునాథ్‌పై జిల్లా అధికారి ప్రశాంత్ కుమార్ మిశ్రా ఆగ్రహం వ్యక్తం చేశారు. సిరుగుప్ప పట్టణ ప్రభుత్వాస్పత్రిని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో తాగునీరు కొరత, పరిశుభ్రతలేని వాతావరణం, బెడ్‌ల కొరత వున్న విషయాన్ని గమనించి జిల్లా అధికారి మండిపడ్డారు. ప్రభుత్వం పేద ప్రజలకు వైద్యం అందించడం కోసం కోట్లాది రూపాయలు ఖర్చుచేస్తున్నా వాటిని సమకూర్చడంలో వైద్యుల నిర్లక్ష్యంపై మండిపడ్డారు. ముందు రోజుల్లో ఇలాగే వుంటే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

తప్పుడు కేసులు పెట్టే వారిపై చర్యలు



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

కంప్లి, జూన్ 2 : గ్రామాల్లో కులమతాల మధ్య చిచ్చు పెట్టి పోలీస్ స్టేషన్‌లో తప్పుడు కేసులు నమోదు చేసే వారిపై ప్రభుత్వాధికారులు చర్యలు తీసుకోవాలని వీరశైవ సమాజం ప్రముఖులు హేమయ్య స్వామి తెలిపారు. వాల్మీకి, పింజరు, ఉప్పర, చలవాది, వివిధ సమాజాల ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వారు మనవిపత్రం అందజేశారు. వన్నళ్లి దేవాలయం వద్ద జరిగిన ఘర్షణ విషయంపై కుడితిని పోలీస్ స్టేషన్‌లో దళితులపై తప్పుడు కేసులు పెట్టారని, అలాంటి వారిపై దృష్టి సారించాలన్నారు. వన్నళ్లి గ్రామానికి చెందిన ఉలిగప్ప, ఆలయ పూజారి విశాలాక్షి ఆలయం వద్ద ఘర్షణకు దిగడంతో అక్కడున్న స్థానికులు ఘర్షణ పడుతున్న వారిని విడిపించేందుకు వెళ్లగా వారిపైనే ఉలిగప్ప కేసులు నమోదు చేశారన్నారు. గ్రామంలో వాల్మీకి, లింగాయత్, కురుబ, ఉప్పర, ఇతర సమాజాల వారు ఐక్యతతో వున్నారని, కానీ దళిత సమాజం మాత్రం అన్ని సమాజాలకు విరుద్ధంగా వుంటూ గ్రామాల్లో కులమతాల చిచ్చులు పెడుతోందన్నారు. జిల్లా అధికారులు ఇలాంటి వారిపై దృష్టి సారించి మరోసారి ఏ పోలీస్ స్టేషన్‌లో తప్పుడు కేసులు నమోదు చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వారితో పాటు నారాయణప్ప, ఉలిగప్ప, వీరేష్ పాల్గొన్నారు.

ఈశాన్య పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికకు సర్వం సిద్ధం



నేడే పోలింగ్ ● ఓటేయనున్న 1,55,623 మంది..

● 7 జిల్లాల్లో 160 పోలింగ్ కేంద్రాలు



● అమర్‌నాథ్ పాటిల్, బీజేపీ ● చంద్రశేఖర్ పాటిల్, కాంగ్రెస్ ● నారా ప్రతాప్‌రెడ్డి, ఇండిపెండెంట్

బళ్లారి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఈశాన్య పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో పోలింగ్ ఆదివారం జరగ నుంది. బళ్లారి, విజయనగర, రాయచూరు, కొప్పళ, కలబురిగి, యాదగిరి, బీదర్ జిల్లాల్లో ఉండే 1,56,623 పట్టుభద్రులు ఈ ఎన్నికల్లో ఓటేయనున్నారు. వారికోసం 160 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ పోలింగ్ నిర్వహిస్తున్నట్లు కలబురిగి ఎన్నికల అధికారి తెలిపారు. ఈ ఎన్నికల్లో ప్రధానంగా బీజేపీ, కాంగ్రెస్, ఇండిపెండెంటు అభ్యర్థుల మధ్య పోటీ నెల కొంది. బీజేపీ నుండి అమర్‌నాథ్ పాటిల్, కాంగ్రెస్ పార్టీ నుండి చంద్రశేఖర్ పాటిల్, ఇండిపెండెంట్ అభ్యర్థిగా నారా ప్రతాప్‌రెడ్డి పోటీలో ఉన్నారు.

కాంగ్రెస్ ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్న చంద్రశేఖర్ పాటిల్‌నే రంగంలోకి దించగా, బీజేపీ నుండి అమర్‌నాథ్ పాటిల్ పోటీచేస్తున్నారు. ఈ ఇద్దరూ కలబురిగి ప్రాంతం వారే. ఇండిపెండెంట్ అభ్యర్థి ప్రతాప్ రెడ్డి ఒక్కరే బళ్లారి వాసి కావడం గమనార్హం. ఇంతకు ముందు నుంచి కలబురిగి ప్రాంతం వారే ఎమ్మెల్సీగా గెలుస్తూ వచ్చారని, బళ్లారి, రాయచూరు, విజయనగర, కొప్పళ జిల్లా వాళ్లకు ఇంత వరకూ అవకాశం రాలేదని కనుక ఈసారి తనను గెలిపించాలని ఆయన ప్రచారం చేశారు. అంతే కాకుండా ఈ ప్రాంతంలో సుమారు 40 వేల మందిని ఆయనే ఓటర్లుగా చేర్పించినట్లు తెలిపారు. మొత్తం మీద ఇండిపెండెంట్ ప్రతాప్‌రెడ్డి, బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులకు గట్టి పోటీ ఇస్తున్నారు. నేడు పట్టుభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనుండగా, మరుసటి రోజు మంగళవారం ఎంపీ ఎన్నికల ఓట్ల లెక్కింపు సాగుతుంది. ఈనేపథ్యంలో జిల్లాలో రాజకీయ సందడి నెలకొంది. అధికారులు కూడా తీరిక లేకుండా ఎంపీ, ఎమ్మెల్సీ ఎన్నికలు ఒక దాని తరువాత ఒకటి రావడంతో బిజీ బిజీగా ఆదివారం కూడా సెలవు లేకుండా పనిచేస్తున్నారు.

సిరుగుప్పలో 3,323 మంది ఓటర్లు

సిరుగుప్ప: ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సోమవారం జరుగనున్నట్లు సిరుగుప్ప తాలుకా ఎన్నికల అధికారి షంషాలం తెలిపారు. సిరుగుప్ప తాలుకాలో 3323 మంది ఓటర్లు ఉన్నట్లు ఆయన తెలిపారు. తాలుకావ్యాప్తంగా నాలుగు చోట్ల పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అచ్చొళ్లి, కరూరు, టెక్కలకోట, సిరుగుప్ప పట్టణంలో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఓటర్లు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవకాశం వుంటుందని ఆయన తెలిపారు.

5 వరకు మద్యం అమ్మకాలు బంద్



జిల్లాధికారి దివాకర్

కంప్లి, జూన్ 2 : విజయనగర జిల్లాలో ఈ నెల 5వ తేదీ వరకు మద్యం అమ్మకాలు బంద్ చేయాలని జిల్లా అధికారి ఎంఎస్ దివాకర్ సూచించారు. ఆయన ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్, విధానపరిషత్ ఎన్నికల సందర్భంగా మద్యం అమ్మకాలు బంద్ చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామాల్లో గానీ, పట్టణాల్లో గానీ అమ్మకాలు చేపడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే విజయనగర జిల్లాలోని హోస్పేట, కూడ్లిగి, హగరి బొమ్మనళ్లి, హడలిగి, హరప్పనహళ్లి తాలుకాలో పోలీసు అధికారులకు, అబ్కారీ అధికారులకు సూచనలు ఇచ్చామన్నారు. 4వతేదీ ఓట్ల లెక్కింపు సందర్భంగా గ్రామాల్లో మద్యం అమ్మినా, సేవించినా, గ్రామాల్లో గొడవలు చేపడితే వారిపై ఎన్నికల కేసులు నమోదు చేస్తామన్నారు.

రౌడీషీటర్లకు కడక్ వార్నింగ్



రౌడీషీటర్లను హెచ్చరిస్తున్న సీఐ ప్రకాష్ మాళి

కంప్లి, జూన్ 2 : కంప్లి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం సీఐ ప్రకాష్ మాళి రౌడీషీటర్లకు కడక్ వార్నింగ్ ఇచ్చారు. 3న విధాన పరిషత్ ఎన్నికలు, 4వ తేదీన కౌంటింగ్ సందర్భంగా ఘర్షణలకు దిగితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పోలీసు అధికారుల షరతులను దృష్టిలో వుంచుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు, గొడవలకు పాల్పడకుండా జాగ్రత్తలు వహించాలని సూచించారు. వారితో పాటు ఎస్ఐ బీఎస్ నాయుడు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రెండు బైకులు ఢీ: యువకుడి మృతి

బళ్లారిరూరల్, జూన్ 2 : తాలుకాలోని సిటిగినమల గ్రామానికి చెందిన కుబేర కుమారుడు చరణ్ (21) శనివారం పీడీహళ్లి నుండి తమ గ్రామానికి ద్విచక్రవాహనంలో వెళుతుండగా ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనం అతడిని బలంగా ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన చరణ్‌ను బళ్లారి విమ్స్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ చనిపోయినట్లు పీడీహళ్లి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఈ రెండు బైకులు ఢీకొన్న ప్రమాదంలో మరో యువకుడు వీరేష్ కూడా తీవ్రంగా గాయపడటంతో అతడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

మంత్రివర్గం నుంచి నాగేంద్రను తొలగించాలి

● ఎస్టీ కార్పొరేషన్ ఖాతా నుంచి రూ.187కోట్ల స్వాహాకు యత్నించిందెవరు?

● అక్రమాల వెనుక కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇంకెందరున్నారో తేల్చాలి

● కేంద్రంలో ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి రావడం ఖాయం

● మాజీ మంత్రి, ఎంపీ అభ్యర్థి బి. శ్రీరాములు

బళ్లారి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఎస్టీ నిగమ మండలికి సంబంధించిన బ్యాంకు ఖాతాలో ఉన్న రూ.187 కోట్లు దోచుకునేందుకు ప్రయత్నించిన వ్యక్తులపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి, ఎంపీ అభ్యర్థి శ్రీరాములు డిమాండ్ చేశారు. ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి బి. నాగేంద్ర వెంటనే రాజీనామా చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. బళ్లారిలో ఆదివారం మాజీ మంత్రి శ్రీరాములు మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర రెడ్డి, ఎమ్మెల్సీ సతీష్ రెడ్డి, బళ్లారి జిల్లా బీజేపీ అధ్యక్షుడు అనీల్ నాయుడు, రామలింగప్ప, తదితర నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరాములు

ఎస్టీ నిగమ మండలికికి సంబంధించి బ్యాంకు ఖాతాలో నుంచి రూ.187 కోట్లు దోచుకునేందుకు ప్రయత్నించడం రాష్ట్రంలో ఎప్పుడూ చూడలేదన్నారు. బెంగళూరు నుండి బ్యాంకు ఖాతాను హైద్రాబాద్‌కు మార్చి అక్కడ చెక్కుల ద్వారా డబ్బు డ్రా చేశారని పేర్కొన్నారు. ఎస్టీ నిగమ మండలి అధికారి చంద్రశేఖర్ తన మరణ వాగ్మూలంలో మంత్రి పేరు రాశారని తెలిపారు. అధికార పార్టీ నాయకులు చేసిన అక్రమ పనికి అధికారి ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమన్నారు. మంత్రి నాగేంద్రను తన పదవి నుండి తప్పించి ఈ కేసుకు సీబీఐకి అప్పగించాలని కోరారు. ఒక ప్రభుత్వ ఖాతాలో నుండి ఇంత పెద్ద మొత్తం డ్రా చేయడానికి చేసిన కుట్రలో ఇంకెవరి హస్తం ఉందో తేల్చాలని కోరారు. అలాగే దేశ రాజకీయాల గురించి మాట్లాడారు. తిరిగి దేశంలో ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి వస్తుందని ప్రధానిగా నరేంద్ర మోదీని తిరిగి ఎన్నుకుంటారని అన్నారు. కర్నాటకలో 28 స్థానాలకు 23 స్థానాలు గెలుస్తామని చెప్పారు.

సీఈటీ ర్యాంకుల్లో వశిష్ట విద్యార్థుల జోరు



చిన్మయి విక్రమ్ సూర్య ప్రమోద్ హఫీజా కార్తిక్ ఉషా

బళ్లారి సిటీ, జూన్ 2: ఇంజనీరింగ్, వ్యవసాయం, పశువైద్యం, నర్సింగ్, ఫార్మసీ, యోగా, నేచురోపతి కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించిన ఉమ్మడి పరీక్ష (కేసీఈటీ)ఫలితాల్లో వశిష్టకాలేజీ విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారు. ఈ ఫలితాలను శనివారం ప్రకటించారు. ఇంజినీరింగ్ విభాగంలో చిన్మయి 226వ ర్యాంకు, విక్రమ్ సూర్య 475వ ర్యాంకు, డి.ప్రమోద్ 525వర్యాంకు, హఫీజా 799వర్యాంకు, కార్తీక్ 863వ ర్యాంకు సాధించారు. పశువైద్య విభాగంలో కూడా కార్తీక్ 863వ ర్యాంకు, ఉషా 972వ ర్యాంకులను సాధించారని కాలేజీ ప్రిన్సిపాల్ రమేశ్‌రెడ్డి తెలిపారు. ఈ ఘన విజయానికి కారణమైన కాలేజీ ఉపన్యాసకులు, సిబ్బంది, విద్యార్థులను, పాలకులను రమేశ్‌రెడ్డి అభినందించారు.

సత్తాచూపిన సర్‌ఎంవీ కాలేజీ విద్యార్థులు



అంశిక వినయ్ మహ్మద్ కృతి సుహైల్ గౌరినాయక్ సంజయ్ నవీన్ అమితాశ్‌రావు దత్తప్రకాశ్

బళ్లారి సిటీ, జూన్ 2: శనివారం ప్రకటించిన సీఈటీ ఫలితాల్లో సర్ ఎంవీ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారు. ఈసంస్థకు చెందిన విద్యార్థి అంశిక బిఎస్సీ అగ్రికల్చర్‌లో 7వ ర్యాంకు, వినయ్ 37వ ర్యాంకు సాధించారు. ఇంజినీరింగ్‌లో ఘనత సాధించిన విద్యార్థులకు కళాశాల యాజమాన్యం, సిబ్బంది అభినందలు తెలిపారు. విద్యార్థులు వివిధ విభాగల్లో మంచి ఫలితాలు సాధించారు. రెహన్నూర్ మహ్మద్ 258వ ర్యాంకు, కృతి271వ ర్యాంకు, మహ్మద్ సుహైల్ 318 వర్యాంకు, సరేంద్రనాయక్ 375వ ర్యాంకు, అమితాశన్ 519వ ర్యాంకు, రిషి రుద్రప్రకాశ్ కొత్తూరు 569వ ర్యాంకు, స్ఫూర్తి భూషణ్ 594వ ర్యాంకు, అమృతోద్దబసప్పనవర్ 609వ ర్యాంకు, వికాస్ 721,ఆకాష్ పాటిల్ 739,సంజనా 8వ ర్యాంకు, కొండాప్రజ్వల్964 వర్యాంకు, నవాజ్ 977,ర్యాంకులు సాధించారని సర్‌ఎంవీ కళాశాల పేర్కొంది. ఈ మేరకు విద్యార్థులను అభినందించింది.

బెస్ట్ కాలేజీ విద్యార్థుల విజయోత్సవం

బళ్లారి సిటీ, జూన్ 2: శనివారం విడుదలైన సీఈటీ పరీక్ష ఫలితాల్లో బెస్ట్ కాలేజ్ విద్యార్థుల విజయోత్సవం జరుపుకున్నారు.అనిల్ కుమార్ సీఈటీలో రాష్ట్రానికి 413వ ర్యాంకును సాధించారు.ప్రదీప్ కుమార్ 855వ ర్యాంకు,మహ్మద్ అక్బర్ 1683, మొత్తం 5000వేల ర్యాంకు లోపల 40మంది విద్యార్థులు, పదివేలలోపల 90మంది విద్యార్థులు, ఇరవైవేల లోపల 120మంది విద్యార్థులు ర్యాంకులు సాధించారని కాలేజీ ప్రాచార్యులు వెంకటేశ్వరావు తెలిపారు. అమోఘ ఫలితాలను సాధించిన విద్యార్థులను బెస్ట్ సంస్థ అధ్యక్షులు కోనంకి రామప్ప, ఉపాధ్యక్షులు కోనంకి తిలక్, కార్యదర్శిలు శ్రీనివాసులు, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు విద్యార్థులను అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న బెస్ట్ సంస్థ అధ్యక్షుడు కోనంకి రామప్ప

గారపాటి రామకృష్ణకు ఎన్టీఆర్ పురస్కారం



గారపాటి రామకృష్ణకు ఎన్టీఆర్ పురస్కారం అందిస్తున్న దృశ్యం

కంప్లి, జూన్ 2: సమాజ సేవకుడు, అఖిల కర్ణాటక కమ్మవారి సంఘం అధ్యక్షులు గారపాటి రామకృష్ణకు ఎన్టీఆర్ సాహిత్యకళా సేవారంగాల పురస్కారం అందించారు. విశ్వవిఖ్యాత నట సార్వభౌమ, మహానేత ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని హైదరాబాద్‌లో సుందరయ్య విజ్ఞాన కేంద్రం లింగంపల్లిలో భారతీయ సాహితీ అనువాద ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆయనను ఆదివారం సన్మానించారు. గతంలో ఆయన సమాజసేవలతో పాటు అఖిల కర్ణాటక కమ్మవారి సంఘం అధ్యక్షులుగా వుండటంతో ఆయనను గుర్తించి ఎన్టీఆర్ అవార్డును అందించినట్లు భారతీయ సాహిత్య అనువాద ఫౌండేషన్ తెలిపింది. ఈ సందర్భంగా గారపాటి రామకృష్ణ మాట్లాడుతూ తారక రామారావు అవార్డు దక్కినందుకు ఎంతో ఆనందంగా వుందన్నారు. ప్రతిఒక్కరు సేవాభావాలతో ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో కళారత్న బిక్కి కృష్ణ, రిటైర్డ్ న్యాయమూర్తి చంద్రకుమార్, పద్మశ్రీ కొలకూరి ఇనాక్, జనార్ధన, అశ్వినీదత్, నరసింహప్ప, నందమూరి మోహనకృష్ణ, రేలంగి నరసింహారావు, వైవీఎస్ చౌదరి, ప్రసన్న కుమార్, కొమ్మినేని పాల్గొన్నారు.

వేదావతికి భారీగా వరదనీరు



పీడీ హళ్లి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వేదావతి నది

బళ్లారిరూరల్, జూన్ 2: తాలుకాలోని పీడీ హళ్లి సమీపంలో ఉన్న వేదావతి నదికి ఆదివారం భారీగా వరదనీరు చేరింది. శనివారం రాత్రి ఆంధ్ర, అనంతపురం జిల్లా ఉరవకొండ, కణేకల్లు, రాయదుర్గం, బొమ్మనహాళ్ మండలాల్లో పెద్దఎత్తున వర్షం రావడంతో ఒకేసారి పెద్దఎత్తున నది ప్రవాహం పెరిగింది. ఈ సంవత్సరం మొట్టమొదటిసారిగా వేదావతి హగరి నదికి భారీగా నీరు రావడంతో పలువురు రైతులు విశేష పూజలు నిర్వహించారు.

హోసూరు జోన్

దుకాణాల్లో పౌర ఆహారశాఖ అధికారుల తనిఖీలు



తనిఖీ చేస్తున్న ఫుడ్‌సేఫ్టీ అధికారి

హోసూరు జూన్ 2: తమిళనాడు ప్రభుత్వం నిషేధించిన పాన్ మసాలా, గుట్కా ఉత్పత్తుల విక్రేతలపై కఠిన చర్యలు తీసుకోవాలని కృష్ణగిరి జిల్లా ఎస్పీ తంగదురై ఆదేశాలతో ఫుడ్‌సేఫ్టీ అధికారులు సిప్‌కాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్ఐ ప్రకాశ్ నేతృత్వంలో తనిఖీలు నిర్వహించారు. ప్రజల ఆరోగ్యంపై దుష్ప్రభావం చూపే కలిగించే పాన్ మసాలా, గుట్కా ఉత్పత్తులను విక్రయిస్తున్న వ్యక్తులపై 24 కేసులు నమోదు చేశారు. మత్తిగిరి సిప్‌కాట్ పోలీసులు గత రెండు రోజులుగా ఫుడ్ సేఫ్టీ అధికారి ముత్తు మారియప్పన్ సహకారంతో దుకాణాలను తనిఖీ చేశారు. ఆహార భద్రత అధికారి ముత్తు మారియప్పన్ సహకారంతో గత రెండు రోజుల్లో మత్తిగిరి, సిప్‌కాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో దాదాపు 10 దుకాణాలకు సీల్ వేశారు. ఇలాంటి నేరాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని కూడా హెచ్చరించారు.

ఉత్సాహంగా మార్షల్‌ఆర్ట్స్ శిబిరం



శిబిరంలో పాల్గొన్న క్రీడాకారులు

హోసూరు(సిప్‌కాట్), జూన్ 2: కేంద్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన ఒలింపిక్ మార్షల్ ఆర్ట్స్ శిబిరం హోసూరు అందివాడి ఇండోర్ స్పోర్ట్స్ హాల్‌లో రెండు రోజులపాటు జరిగింది. శుక్ర, శనివారాలలో జరిగిన ఈ శిబిరంలో 30 మందికి పైగా జిల్లా కార్యదర్శులు, శిక్షకులు హాజరై శిక్షణ పొందారు. రాష్ట్ర కార్యదర్శి జాన్సన్, సాంకేతిక నిపుణులు రవి, గోపీ శిక్షణ ఇచ్చారు. శిక్షణ శిబిరం కృష్ణగిరి జిల్లా అధ్యక్షుడు జయప్రకాశ్, జిల్లా కార్యదర్శులు జయకుమార్ నిర్వహించారు. కళావతి చంద్రన్, సంఘ సేవకుడు మన్ను అలియాస్ దౌలత్ ఖాన్, గౌరవ నాయకుడు సంఘ సేవకుడు అజాంబాషా, జిల్లా క్రీడా అధికారి రాజగోపాల్ పాల్గొని శిక్షణ అందించిన వారిని అభినందించారు.

ద్విచక్రవాహనాల స్వాధీనం - ఇద్దరి అరెస్టు

హోసూరూ (క్రైం), జూన్ 2: హోసూరు చుట్టుపక్కల ప్రాంతాల్లో సైకిళ్లు, ద్విచక్ర వాహనాలు పోగొట్టుకున్నవారి ఫిర్యాదులపై దర్యాప్తు చేస్తుండగా పోలీసులకు జీపీఆర్ఎస్ పరికరాలు అమర్చిన ద్విచక్ర వాహనం లభించింది. వాహనాన్ని గుర్తించిన పోలీసులు దానిని దొంగిలించిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేపట్టారు. విచారణలో హోసూరు, తిరువణ్ణామలైకి చెందిన ఇద్దరు 17ఏళ్ల యువకులు ఆన్‌లైన్‌లో స్నేహితులుగా మారి ద్విచక్ర వాహనాలను చోరీ చేసి, తాకట్టుపెట్టి దాని ద్వారా వచ్చే డబ్బును పంచుకునేవారని తెలిసింది. పోలీసులు మరో 7 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు యువకులను పోలీసులు అరెస్ట్ చేసి సేలం జైలుకు తరలించారు. ఇప్పటికే ద్విచక్రవాహనాల చోరీపై పలు ఫిర్యాదులు పోలీసులకు అందాయి.



పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలు

నేటి నుంచి అంగన్‌వాడీ వర్కర్ల నిరవధిక సమ్మె



జిల్లా అధ్యక్షురాలు పద్మ

రాయచూరు, జూన్ 2: ప్రభుత్వ పాఠశాలల్లో ఎల్‌కేజీ, యూకేజీ తరగతుల ప్రారంభాన్ని నిరశిస్తూ అంగన్‌వాడీలు ఈ నెల 3వ తేదీ నుంచి నిరవధిక సమ్మెకు దిగుతున్నట్లు అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు హెచ్.పద్మ తెలిపారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం విలేఖరులతో మాట్లాడిన ఆమె సీఐటీయూ అనుబంధ అంగన్‌వాడీ వర్కర్ల యూనియన్ నిర్ణయం మేరకు కల్యాణ కర్ణాటక ప్రాంతంలోని 8 జిల్లాల్లో జూన్ 3వ తేదీ నుంచి అంగన్‌వాడీ కేంద్రాలు పని చేయవని స్పష్టం చేశారు. వర్కర్లందరూ విధిగా నిరవధికు సమ్మెకు మద్దతునివ్వాలని కోరారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని అంగన్‌వాడీ కేంద్రాల్లోని ఎల్‌కేజీ, యూకేజీ తరగతులను కొనసాగించాలని దీంతోపాటు అంగన్‌వాడీ కేంద్రాలు ఎదుర్కొంటున్న ఇతర సమస్యల పరిష్కారం చేయాలని కోరుతు కలబుర్గిలోని విద్యాశాఖ ప్రాంతీయ అధికారి కార్యాలయం వద్ద నిరవధిక సమ్మెకు దిగుతున్నట్లు ఆమె తెలిపారు.

సైక్లింగ్‌తో ఆరోగ్యానికి రక్షణ

● ఎమ్మెల్యే డాక్టర్ శివరాజ్ పాటిల్



జెండాఊపి సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్

రాయచూరు, జూన్ 2: ప్రతి రోజు సైక్లింగ్ చేయడం ఆరోగ్య రక్షణకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని సిటీ ఎమ్మెల్యే డాక్టర్ శివరాజ్ పాటిల్ అన్నారు. జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ప్రపంచ సైక్లింగ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ ర్యాలీని సిటీ ఎమ్మెల్యే డాక్టర్ శివరాజ్ పాటిల్ ప్రారంభించి మాట్లాడారు. గతంలో విరివిగా సైకిళ్లు వాడడం వల్ల అనేక మంది అనారోగ్యానికి దూరంగా ఉండే వారని గుర్తు చేశారు. ఇటీవల కాలంలో వాహనాల వినియోగం పెరిగిన నేపథ్యంలో శారీరక వ్యాయామం తగ్గిపోయిందన్నారు. సైక్లింగ్ వల్ల శారీరక వ్యాయామం జరగడంతో పాటు ఆరోగ్య పరంగా లబ్ధి ఉంటుందన్నారు. ఈ విషయంలో సైక్లింగ్ రన్ అసోసియేషన్ ప్రతినిధులను సిటీ ఎమ్మెల్యే అభినందించారు. ర్యాలీ నగరంలోని బసవేశ్వర సర్కిల్ నుంచి ప్రారంభమై ప్రధాన రహదారుల గుండా సాగింది.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కుంచె...

డాక్టర్ ఎం. కరుణానిధి (జయంతి)




కళైజ్ఞర్‌గా పేరొందిన డాక్టర్ ముత్తువేల్ కరుణానిధి 1924 జూన్ 3న జన్మించారు. ఐదు సార్లు తమిళనాడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా సుదీర్ఘకాలం సేవలందించిన ఘనత ఆయనది. ద్రవిడ మున్నేట్ర కళగం (డీఎంకే) పార్టీ అధ్యక్షుడు, సంస్థాపక సభ్యుడు. 60 ఏళ్ల రాజకీయాల్లో పోటీ చేసిన ప్రతి ఎన్నికల్లో గెలుపొంది రికార్డు సృష్టించారు. 2004 లోక్‌సభ ఎన్నికల్లో తమిళనాడులోని అన్ని లోక్‌సభ స్థానాల్లో యూపీఏ గెలిపించడంలో కీలకపాత్ర పోషించారు. రాజకీయాల్లోకి రాకముందు తమిళ సినీ రంగంలో స్క్రీన్‌రైటర్‌గా రాణించారు. తమిళ సాహిత్యంలో గొప్ప సేవలందించారు. ద్రవిడ ఉద్యమంలో కీలకపాత్ర పోషించారు. గౌరవ డాక్టరేట్‌లు అందుకున్నారు. 2018 ఆగస్టు 7న కన్నుమూశారు.

శంకర కురుప్ (జయంతి)



పద్మభూషణ్ గ్రహీత జీ శంకర కురుప్ 1901 జూన్ 3న జన్మించారు. మళయాళ సాహిత్యంలో ఆయన మహా కవిగా పేరొందారు. కవి, రచయిత, సాహితీవేత్తగా రాణించారు. తొలి జ్ఞానపీఠ పురస్కార గ్రహీత ఆయనే. 40కుపైగా పుస్తకాలు, 250 కవితలు ప్రచురితమయ్యాయి. చిన్నకథలు, నాటకాలు, వ్యాసాలు ఉన్నాయి. రవీంద్రనాథ్ రచించిన 'గీతాంజలి'ని మళయాళంలోకి అనువాదం చేశారు. సాహిత్య అకాడమీ అవార్డు, కేరళ సాహిత్య అకాడమీ అవార్డు, సోవియెట్ ల్యాండ్ నెహ్రూ అవార్డు అందుకున్నారు. 1968 నుంచి 1972వరకు రాజ్యసభ సభ్యుడిగా వ్యవహరించారు. 1978 ఫిబ్రవరి 2న కన్నుమూశారు.

వేదాంతం రామలింగశాస్త్రి (పుట్టినరోజు)



వేదాంతం రామలిగశాస్త్రి 1963 జూన్ 3న కృష్ణా జిల్లా మొవ్వ మండలం కూచిపూడిలో జన్మించారు. కూచిపూడి నృత్య కళాకారుడిగా, నృత్య దర్శ కుడిగా, రచయితగా, నాట్యా చారు డిగా, నటుడిగా, పరిశోధ కుడి గా బహుముఖ ప్రజ్ఞాశాలి. సిద్ధేంద్రయోగి కూచి పూడి కళాపీఠంలో ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. 2008లో 300మంది డ్యాన్సర్లతో ఏర్పాటైన నృత్య ప్రదర్శనకు గిన్నిస్‌బుక్ రికార్డు సాధించారు. 2022 డిసెంబరులో కేంద్ర సంగీత నాటక అకాడమీ సభ్యుడిగా ఎంపికయ్యారు. నాట్యరత్న, నాట్య సామ్రాట్, సంగీత నాటక అకాడమీ పురస్కారాలు అందుకున్నారు.

రాఫెల్ నడాల్ (పుట్టినరోజు)



స్పానిష్ దేశ టెన్నిస్ క్రీడాకారుడు రాఫెల్ నడాల్ 1986 జూన్ 3న జన్మించారు. ఎడమ చేతి వాటం కల్గిన వ్యక్తి. ఏటీపీ ర్యాంకింగ్స్‌లో 209 వారాలపాటు నెంబరు 1 ర్యాంకులో కొనసాగారు. 22 గ్రాండ్‌స్లామ్ మెన్స్ సింగిల్స్ టైటిల్స్ అందుకున్నారు. వీటిలో 14 ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్స్ కూడా ఉన్నాయి. స్పెయిన్ డేవిస్ కప్ టీమ్ ఐదుసార్లు గెలుపొందారు. 2022లో టైమ్ మ్యాగజైన్ టాప్ 100 ప్రభావిత వ్యక్తులలో ఒకరిగా నిలిచారు. సొంతప్రాంతం మల్లోర్కాలో టెన్నిస్ అకాడమీని ఏర్పాటు చేయడంతోపాటు సమాజ సేవలోనూ రాణిస్తున్నారు.

రుతుపవనాలు వచ్చేశాయ్

అనంతపురం అర్బన్, జూన్ 2: నైరుతి రుతుపవనాలు ఆదివారం సాయంత్రం అనంత జిల్లాను తాకాయి. ఈ ప్రభావంతో జిల్లాలో సోమవారం నుంచి మూడు రోజులపాటు తేలిక పాటి నుంచి ఓ మోస్తరు వర్షం పడే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాస్త్రవేత్తలు పే ర్కొన్నారు. అలాగే ఒకటి, రెండు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడే అవకాశం ఉంది. 30-40 కిమీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్నారు. గతేడాది జూన్ 8న జిల్లాలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయి. గతంలో పోలిస్తే... ఆరు రోజుల ముందుగానే జిల్లాలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయి. ఈ ఏడాది సాధారణ వర్షపాతం కంటే ఎక్కువగానే వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. ఇదే జరిగితే గత ఏడాదితో పోలిస్తే ఎక్కువ విస్తీర్ణంలోనే పంటలు సాగయ్యే అవకాశం ఉంది. జిల్లాలోని 20 మండలాల్లో శనివారం రాత్రి వర్షం కురిసింది. అత్యధికంగా ఉరవకొండలో 52.6 మి.మీ వర్షపాతం నమోదైంది. కూడేరు 50.4, బెళుగుప్ప 49.8, రాయదుర్గం 35.6, వజ్రకరూరు 32.2, బొమ్మనహాళ్ 27.2, గుమ్మఘట్ట 25.8, కళ్యాణదుర్గం, కంబదూరు 24.2, ఆత్మకూరు 20.0, బ్రహ్మసముద్రం 18.2, కణేకల్లు 17.0, విడనపకల్లు, యాడికి 14.2, యల్లనూరు 12.6 మి.మీ వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లో 8.2 మి.మీలోపు వర్షపాతం నమోదైంది. అదే విధంగా శ్రీసత్యసాయి జిల్లాలో అత్యధికంగా కనగానపల్లిలో 54.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖాధికారులు తెలిపారు. చిలమత్తూరు 51.2, నంబులపూలకుంట 44.2, కొత్తచెరువు 42.2, గోరంట్ల 42.0, పెనుకొండ 40.0, రామగిరి 33.4, పుట్టపర్తి 29.8, కదిరి 27.2, గాండ్లపెంట 26.8, చెన్నేకొత్తపల్లి 22.6, నల్లచెరువు 22.4, అమడగూరు 21.6, బుక్కపట్నం 16.4, ఓబుళదేవరచెరువు 16.2, సోమందేపల్లి 15.4, హిందూపురం 14.8, పరిగి 14.2, నల్లమాడ 13.2, రొళ్ల 10.4, ధర్మవరం, తనకల్లు 9.6, మడకశిర 9.2, గుడిబండ 8.8, లేపాక్షి 8.2, రొద్దం 7.6 మిమీ, అమరాపురం 6.2 మిమీ, తాడిమర్రి 5.8, బత్తలపల్లి 3.4, అగళి 3.0, తలుపులలో 2.8 మి.మీ వర్షపాతం నమోదైందన్నారు. ఈదురుగాలుల నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని పలుప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. శనివారం రాత్రి వీచిన ఈదురుగాలకు కూడేరు, శింగనమల, చెన్నేకొత్తపల్లి ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. ఆయా ప్రాంతాల్లో 15విద్యుత్ స్తంభాలు పడిపోయినట్లు విద్యుత్ శాఖ ఎస్ఈ సురేంద్ర తెలిపారు. దీంతో స్వల్ప నష్టం జరిగినట్లు వెల్లడించారు. ఇబ్బందులు తలెత్తిన ప్రాంతాల్లో లైన్లను మరమ్మతులు చేసి..విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్లు పేర్కొన్నారు. బొమ్మనహాళ్ మండలంలో శనివారం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. అక్కడక్కడ మొక్కజొన్న, పత్తి పంటలు వర్షపునీటికి తడిసిపోయాయి. ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షం కురవడం వల్ల వరదనీరు ఉద్దేహాళ్ హగరికి భారీగా వచ్చి చేరింది. కొళగానహళ్లి, కబాలివంకలు ఉధృతంగా ప్రవహించాయి. మండలంలో దేవగిరి, ఉద్దేహాళ్, శ్రీధరఘట్ట తదితర గ్రామాలలో భారీ వర్షం పడింది. 27.2 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

కౌంటింగ్‌లో సంయమనం పాటించండి

▸▸ సిబ్బందికి జిల్లా అధికారి అక్రంపాషా సూచన



జిల్లా అధికారి అక్రంపాషా



శిబిరంలో పాల్గొన్న పీఓలు, ఏపీఓలు తదితరులు

బంగారపేట, జూన్ 2: లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్ వేళ సిబ్బంది సంయమనం, క్రమశిక్షణ పాటించాలని జిల్లా ఎన్నికల అధికారిగా ఉన్న జిల్లా అధికారి అక్రం పాషా సూచించారు. కోలారు లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని అధికారులకు ఆదివారం ప్రత్యేక శిక్షణా శిబిరం నిర్వహించారు. శిబిరానికి నేతృత్వం వహించి పలు సలహా సూచనలు చేశారు. జిల్లా పరిపాల నాభవంలో ఏర్పాటైన సమావేశంలో ప్రిసైడింగ్ ఆఫీసర్‌లు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్‌లు పాల్గొన్నారు. కోలారు పట్టణంలోని ఫస్ట్‌గ్రేడ్ కళాశాలలో కౌంటింగ్ జరగనుంది. మంగళవారం ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే కౌంటింగ్‌లో ఎలా వ్యవహరించాలి, ఓట్ల లెక్కింపు సరళిని బాధ్యతాయుతంగా నిర్వహించాలని సూచించారు. సంయమనం,క్రమశిక్షణ పాటించాలన్నారు. కౌంటింగ్ కేంద్రానికి 6 గంటలకే చేరుకోవాలని 6.30 గంటలకు హాజరు ఉంటుందన్నారు. అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా ఎన్నికల కమిషన్ మంజూరు చేసిన గుర్తింపుకార్డు ధరించాలన్నారు. కౌంటింగ్ కేంద్రంలోకి మొబైల్, కంప్యూటర్ ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించబడవని స్పష్టం చేశారు. తొలుత పోస్టల్‌బ్యాలెట్‌లను కౌంట్ చేయాల్సి ఉంటుందని అనంతరం ఈవీఎంలలోని ఓట్లను లెక్కించాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల సిబ్బంది అనుకూలం కోసం ఆయా తాలూకా కేంద్రాలనుంచి కేఎస్ఆర్టీసీ బస్సు వ్యవస్థ కల్పించారని ఉద్యోగులు సమయానికి హాజరు కావాలని సూచించారు. ఎన్నికల తర్ఫీదు ట్రైనింగ్ నోడల్ ఆఫీసర్ బోడరెడ్డి పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ చేశారు. ఎన్నికలకు సంబంధించిన వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితే జీవితమంతా సుఖమే

▸▸ పీయూ తరగతుల ప్రారంభంలో ఎమ్మెల్యే రవిసుబ్రహ్మణ్య



ప్రోత్సాహకాలు ప్రశంసాపత్రాలతో విద్యార్థులు, ముఖ్యులు

బెంగళూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థికి రెండేళ్ల పీయూ చదువు జీవితకాలాన్ని మార్చే ప్రయాణం లాంటిదని మొబైల్, సోషల్‌మీడియాకు దూరంగా ఉండి కష్టపడి చదివితే జీవితకాలమంతా సుఖమేనని బసవనగుడి ఎమ్మెల్యే రవిసుబ్రహ్మణ్య అభి ప్రాయపడ్డారు. పీఈఎస్ హనుమంతనగర్ పీయూ కళాశాల తరగతులను ఆదివారం లాంఛనంగా ప్రారంభించారు. యూనివర్సిటీలోని ఎంఆర్‌డీ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో వైస్ చాన్స్‌లర్ సూర్యప్రసాద్, డైరెక్టర్ ఎంవీ సత్యనారాయణ, ప్రిన్సిపాల్ సీ నారాయణరెడ్డి ముఖ్యులుగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సరిగా 50ఏళ్లక్రితం పీయూ కళాశాలతోనే పీఈఎస్ ఆరంభమైందని ప్రస్తుతం ప్రపంచంలోనే అగ్రగామి యూనివర్సిటీగా రాణిస్తోందని కొనియాడారు. ఒకప్పుడు మౌలిక సదుపాయాలు లేవని, తగిన విద్యాసంస్థలు తక్కువే అన్నారు. ప్రస్తుతం ఉన్నతవిద్య అన్ని ప్రాంతాల్లోనూ అందుబాటులోకి వచ్చిందన్నారు. అందుకు తగినట్టుగానే ప్రపంచంతో పోటీపడేలా చదవాల్సి వస్తోందన్నారు. మంచి కళాశాలలు ఏడాదికి 10 లక్షలకుపైగా ఫీజులు ఉన్నాయని, వాటిని భరించేందుకంటే ప్రతిభ కనబరిస్తే అదే కళాశాలలో తక్కువఫీజుతో చదివే వెసలుబాటు ఉంటుందన్నారు. విద్యార్థి క్రమశిక్షణతో చదువుకోవాల్సి ఉందన్నారు. భావిభారత నిర్మాతలు మీరేనని కొనియాడారు. ఇటీవల ముగిసిన విద్యాసంవత్సరంలో పీయూ ద్వితీయ, ప్రథమతోపాటు పీఈఎస్ ఎంట్రెన్స్‌టెస్ట్ (పెసెట్)లో ర్యాంకులు సాధించిన వారికి ప్రోత్సాహక బహుమతులు ప్రదానం చేశారు. కొత్తగా పీయూలో చేరిన సైన్స్, కామర్స్ విద్యార్థులకు డైరెక్టర్ ఎంవీ సత్యనారాయణ ఓరియంటేషన్ ప్రోగ్రామ్ జరిపారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వాసవి హారతి

▸▸ భక్తిశ్రద్ధలలతో ఆలయ కుంభాభిషేకం

బాగేపల్లి, జూన్ 2: కాశీలో నిర్వహించే గంగాహారతి తరహాలో పట్టణంలో ఇదే తొలిసారిగా వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయ రజత మహోత్సవాన్ని పురస్కరించుకుని తమిళనాడు కళాబృందం నిర్వహించిన వాసవి హారతి భక్తులను ఆకట్టుకుంది. పట్టణంలోని వాసవిమాత ఆలయం వద్ద డీవీజీ మెయిన్‌రోడ్డుపై భారీ వేదిక నిర్మించి వాసవి హారతి సమర్పించారు. అంబారీ ఆకారంపై అమ్మవారిని కొలువుదీర్చి విశేష అలంకరణ చేశారు. తమిళనాడు కళాకారుల బృందం శ్లోకాలు చదువుతూ కర్పూర, దీపాల హారతి సమర్పించారు. బాగేపల్లి, గుడిబండ, చేళూరు, చిక్కబళ్ళాపుర, బెంగళూరు, తుమకూరు సహా తదితర ప్రాంతాలకు చెందిన ఆర్యవైశ్య సామాజికవర్గం వారు తరలి వచ్చారు. వాసవి పీఠం సచ్చిదానంద సరస్వతి స్వామిజీ సాన్నిధ్యం వహించగా ఎమ్మెల్సీ టీఏ శరవణ, రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు ఆర్‌పీ రవిశంకర్, డైరెక్టర్ శబరీశ్, ఆర్య వైశ్య యువజన మహాసభ అధ్యక్షుడు సునిల్, పురసభ మాజీ అధ్యక్షుడు బీర్ నరసింహనాయుడు, సభ్యురాలు సుజాతా నాయుడు, ఆర్యవైశ్య మండలి ట్రస్టు అధ్యక్షుడు కేవీ వెంకటేశ్ గుప్త, మహిళా అధ్యక్షురాలు ఇంద్రాణి, కార్యదర్శి శ్వేతాగంజూమ్ తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్సీ శరవణ మాట్లాడుతూ రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని లోకకల్యాణం కోసం విశేషపూజలు చేసినట్టు తెలిపారు. ఆలయ కుంభాభిషేకం, ఇతర పూజా కార్యక్రమాలు భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



గంగా హారతి తరహాలో వాసవి హారతి సమర్పణ



కుంభాభిషేకంలో పాల్గొన్న భక్తులు

సంతానప్రాప్తి దంపతుల కల : కాజల్ అగర్వాల్

బెంగళూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): సంతానప్రాప్తి దంపతుల కల అని ప్రముఖ సినీ నటి కాజల్ అగర్వాల్ అభిప్రాయపడ్డారు. ప్రెగాన్యూస్ రాయబారిగా నియమితులైన కాజల్ అగర్వాల్ బెంగళూరులో ప్రకటించారు. మ్యాన్‌కైండ్ ఫార్మాకు సంబంధించిన గర్భధారణ గుర్తింపు కార్డు ప్రెగాన్యూస్‌కు రాయబారి కావడం సంతోషమన్నారు. దక్షిణభారత్‌లో బ్రాండింగ్ విస్తరణకోసం తనవంతు ప్రచారం చేస్తానన్నారు. గర్భం ధరించేందుకు ముందు పాటించాల్సిన విధానాలు బాగున్నాయని ప్రశంసించారు. కార్యక్రమంలో మేఘనారాజ్, లాస్యమంజునాథ్, అంజలిటోరా, నిషా అగర్వాల్, సుజాత శివకుమార్, సంజనా గల్రాని, కీర్తిజై ధనుషానంద్‌తోపాటు 70మందిపాల్గొన్నారు.



కార్యక్రమంలో నటి కాజల్ అగర్వాల్ తదితరులు

యమహా ఆధ్వర్యంలో బ్లూస్క్వేర్ అవుట్‌లెట్

బెంగళూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఇండియా యమహా మోటార్ నగరంలో బ్లూస్క్వేర్ అవుట్‌లెట్‌ను వర్తూరు పరిధిలో లాంఛనంగా ప్రారంభించింది. యమహా బ్రాండ్ ఉత్పత్తులు అంతర్జాతీయ మోటార్ స్పోర్ట్స్‌కు అనుగుణమైన వస్తువులను మార్కెటింగ్ చేయనున్నారు. యమహా బ్రాండ్ రేసింగ్ పరంపర బ్లూకు అనుగుణంగా ఉంటుందని బ్లూ స్క్వేర్ పేరిట అవుట్‌లెట్ తెరిచామన్నారు. యమహా వాహనాలకు దశాబ్దాలకాలంగా ఆదరణ ఉందని నిర్వాహకులు ప్రకటించారు. సంస్థ అన్ని టూవీలర్ బ్రాండ్ వాహనాలు లభ్యమన్నారు.



అవుట్‌లెట్ ప్రారంభంలో పాల్గొన్న ప్రముఖులు తదితరులు



ప్రభుత్వ ఆసుపత్రిలో పాల దినోత్సవం

రోగులకు పాలు పంపిణీ

బాగేపల్లి, జూన్ 2: ప్రపంచ పాల దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పౌష్టికాంశాలతో కూడిన పాలను కేఎంఎఫ్ డైరెక్టర్ శ్రీనివాస్ రామయ్య నేతృత్వంలో పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మెరుగైన ఆరోగ్యానికి పాలు తాగాలని అభిప్రాయపడ్డారు. పాడిరంగాన్ని ప్రోత్సహించేలా ఏటా జూన్ 1న ప్రపంచ పాల దినోత్సవం ఆచరిస్తున్నారన్నారు. పాలలో కాల్షియం, విటమిన్ ఏ, డి, బి12, ఐరన్, అయోడిన్, మెగ్నీషియం, పోటాషియం తదితర పోషకాంశాలు ఉన్నాయన్నారు. పాల ప్రయోజనాలపై అవగాహన కల్పించేలా దినోత్సవాన్ని ఆచరిస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుతం వందకుపైగా దేశాల్లో పాల దినోత్సవం ఆచరిస్తున్నట్టు తెలిపారు. కర్ణాటక క్షీర ఉద్యమ పితామహగా పేరొందిన ఎం.వి. కృష్ణప్ప జయంతి కూడా ప్రస్తావించారు. కార్యక్రమంలో తాలూకా ఆరోగ్యాధికారి డాక్టర్ వెంకటేశ్‌మూర్తి, డిప్యూటీ మేనేజర్ డాక్టర్ రవికిరణ్, అధికారి ఉమేశ్‌రెడ్డి, మునేగౌడ, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

సిటిజన్ కో-ఆపరేటివ్ డైరెక్టర్ వేణునాయుడు కన్నుమూత

▸▸ పలువురి సంతాపం



కె. వేణునాయుడు (ఫైల్)

బెంగళూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): సిటిజన్ కో-ఆపరేటివ్ బ్యాంకు డైరెక్టర్ కె. వేణు నాయుడు (72) అనారోగ్యంతో అమెరికాలో ఆదివారం ఉదయం కన్నుమూశారు. సిటిజన్ కో-ఆపరేటివ్ బ్యాంకులో 12ఏళ్లుగా ఆయన డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిత్తూరు జిల్లా సోమల మండలం నెల్లిమంద పరిధిలోని బురుజుపల్లి గ్రామానికి చెందిన వేణునాయుడు 1952 డిసెంబరు 26న జన్మించారు. సుదీర్ఘ కాలంగా బెంగళూరులోనే నివసిస్తున్నారు. వ్యాపార వ్యవహారాల తోపాటు ఇక్కడే స్థిరపడ్డారు. ఊపిరితిత్తుల సమస్యలతో మార్చి నెలాఖరున వైద్యం కోసం అమెరికాలో స్థిరపడిన కుమార్తెల వద్దకు భార్య వసుంధరతో కలసి వెళ్లారు. చికిత్సలు ఫలించక కన్నుమూశారు. ఆయన భార్య వసుంధర కూడా అమెరికాలోనే ఉన్నారు. బుధ లేదా గురువారం పార్థివదేహాన్ని బెంగళూరుకు తీసుకొచ్చి అక్కడనుంచి స్వగ్రామమైన బురుజుపల్లికి తరలించనున్నట్టు ఆయన కుమార్తెలు అర్చన, అపర్ణలు తెలిపారు. వేణు నాయుడు మృతి పట్ల సిటిజన్ కో-ఆపరేటివ్‌బ్యాంకు చైర్మన్, సీఎండీలతోపాటు డైరెక్టర్‌లు, కమ్మ వారిసంఘం ప్రతినిధులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

పేద విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ



పుస్తకాల పంపిణీలో పద్మశ్రీ డాక్టర్ రాజణ్ణ తదితరులు

బెంగళూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): భారతీనగర్ రెసిడెన్షియల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వెనుకబడిన వర్గాల, పౌరకార్మికుల పిల్లలకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఆదివారం భారతీనగర్‌లో జరిగిన కార్యక్రమంలో పద్మశ్రీ డాక్టర్ కేఎస్ రాజణ్ణ, నటి శరణ్యశెట్టి, సమాజసేవకుడు బసవరాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెసిడెన్షియల్ అసోసియేషన్ అధ్యక్షుడు రవి మాట్లాడుతూ పాఠశాలలు ఇప్పుడే ప్రారంభమ య్యాయని విద్యార్థులకోసం తమవంతు పుస్తకాలను అందించామన్నారు. సంస్థ ఆధ్వర్యంలో తరచూ సామాజిక సేవా కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు.

రామనగర ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద భద్రత పెంచండి

▸▸ ఈసీకి బీజేపీ అభ్యర్థి డాక్టర్ మంజునాథ్ లేఖ

బెంగళూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మరో రోజులోనే లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుంది. బెంగళూరు గ్రామీణ స్థానానికి సంబంధించిన లెక్కింపు రామనగరలో జరగనుంది. ఓట్ల లెక్కింపు జరిగే ప్రాంతంలో భద్రతను పెంచాలని బీజేపీ అభ్యర్థి డాక్టర్ సీఎన్ మంజునాథ్ ఎన్నికల కమిషన్‌కు లేఖ రాశారు. ఆయన ఆదివారం ఓ ప్రత్యేక లేఖను ఎన్నికల కమిషన్‌కు పంపడం ప్రాధాన్యత సంతరించుకుంది. బెంగళూరు గ్రామీణ ఎన్నికలు ఆరంభం నుంచి ప్రతిష్ఠాత్మకంగా జరిగాయని లేఖలో ప్రస్తావించారు. పలువురు బీజేపీ సానుభూతి పరులపై దాడులు జరిగాయన్నారు. పోలింగ్ రోజున ప్రత్యేక పోలీసు బలగాలు బందోబస్తుతో సజావుగా జరిగిందన్నారు. ఓట్ల లెక్కింపురోజున భద్రతను పెంచాలని లేఖలో కోరారు. శాంతిభద్రతలు కాపాడాలని, కౌంటింగ్‌సెంటర్‌లోకి అనుమతులు లేనివారు రాకుండా చూడాలన్నారు. ఏజెంట్‌లు గొడవలు చేసేందుకు వీలుందని అభిప్రాయ పడ్డారు. రామనగరలో జరిగే ఓట్ల లెక్కింపుకోసం సాయుధ బలగాల బందోబస్తు కేటాయించాలని కోరారు. డాక్టర్ మంజునాథ్ లేఖతో ఎన్నికల కమిషన్ మరింత అప్రమత్తమైనట్టు సమాచారం.

పీజీలో రాణించిన పేపర్‌బాయ్



ఆర్ గణేశ్

బాగేపల్లి, జూన్ 2: రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేద కుటుంబంలో జన్మించి పేపర్ బాయ్ ఆర్ గణేశ్ పీజీ కోర్సు మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్ (ఎంఎస్‌డబ్ల్యు)లో నాల్గో ర్యాంకులో సత్తా చాటుకున్నారు. విద్యార్జనకు కులమతబేధాలు లేవని, ప్రతిభకు కృషి ఉంటే చాలని నిరూపించారు. బిఏలో సైతం ఐదో ర్యాంకు సాధించిన ఇతను పీజీలో నాల్గోర్యాంకు సాధించడంపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తం అవుతున్నాయి. పదో ఏటనుంచే కన్నడ దినపత్రికను సుమారు 300 పేపర్లను పాఠకులకు అందిస్తూ స్థానికుల మన్నన పొందాడు. బెంగళూరు యూనివర్సిటీ ఇటీవల విడుదల చేసిన ఎంఎస్‌డబ్ల్యు ఫలితాల్లో ర్యాంకు సాధించారు. తీరిక సమయాల్లో బంగారు, వెండి ఆభరణాలకు మెరుగు పెడుతుంటారు. విద్యతోపాటు ఇంటిబాధ్యతను మోస్తున్న గణేశ్‌కు హ్యాట్సాఫ్ చెప్పాల్సిందే మరి.

పాత్రికేయుల సంక్షేమమే లక్ష్యం

దొడ్డబళ్లాపుర, జూన్ 2: దొడ్డబళ్లాపుర తాలూకాకు ప్రెస్‌క్లబ్ భవనం నిర్మించడం, కార్యనిరత పాత్రికేయులకు ఇళ్లస్థలాలు కల్పించడం తన ప్రధాన లక్ష్యమని దొడ్డబళ్లాపుర తాలూకా కార్యనిరత పాత్రికేయుల సంఘం నూతన అధ్యక్షుడు చంద్రశేఖర్ డి ఉప్పార్ తెలిపారు. తాలూకాలోని ఎస్ఎస్ ఘాటిలోని హ్యాపి వ్యాలి రిసార్టులో ఏర్పాటైన కార్యక్రమంలో నూతన పదాధికారుల బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడారు. తాలూకాలోని పాత్రికేయుల మధ్య సమన్వయం కొరవడిందని దీన్ని పరిష్కరించి అందరినీ విశ్వాసంలోకి తీసుకుని ప్రామాణికంగా సంఘం అభ్యున్నతికి కృషి చేస్తానన్నారు. జిల్లా పాత్రికేయుల సంఘం అధ్యక్షుడు జి శ్రీనివాస్ మాట్లాడుతూ పాత్రికయులు సహజసిద్ధమైన వార్తలను ఇవ్వాలని, వాస్తవాలను గుర్తించి ముందుకు సాగాలన్నారు. నూతన పదాధికారులను అభినందించారు.

మినీ విధానసౌధలో బర్త్‌డే పార్టీపై విమర్శలు

శిడ్లఘట్ట, జూన్ 2: శిడ్లఘట్ట మినీ విధానసౌధలో ప్రభుత్వ కార్యాలయంలో ఆహార అధికారి ప్రకాశ్ తన బర్త్‌డే పార్టీ చేసుకోవడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ప్రజాసేవలో ఉండాల్సిన ప్రభుత్వ అధికారులు ఇలా వ్యవహరించడం సరికాదని పలువురు అభిప్రాయపడ్డారు. నియమాలు గాలికి వదిలేశారని, ఆఫీసులో ఆహార శాఖ శిరస్తేదార్ ధనలక్ష్మికి కేక్ తినిపిస్తున్న ఫోటోలు వైరల్ అయ్యాయి. ప్రభుత్వ కార్యక్రమాలు ఘనంగా ఆచరించాలంటే వెనుకడుగు వేసే అధికారులు తమ పుట్టినరోజును మాత్రం ఆడంబరంగా చేసుకున్నారని పలువురు విమర్శలు చేయడం గమనార్హం. రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భక్తరహళ్ళి ప్రతీశ్ మాట్లాడుతూ బాధ్యతాయుతమైన అధికారులు ఇలా వ్యవహరించడం సరికాదని ఆరోపించారు. ఇటువంటి నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

విద్యుదాఘాతంతో లైన్‌మేన్ మృతి



నాగరాజు (ఫైల్)

దొమ్మసంద్ర, జూన్ 2: ఎలక్ట్రానిక్ సిటీ సమీపంలోని రాయసంద్రలో లైన్‌మ్యాన్ నాగరాజు బడిగేర్ (28) మృతి చెందాడు. వీరసంద్ర సబ్‌డివిజన్‌లో తొమ్మిదేళ్లుగా బెస్కాం ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం రాయసంద్ర సమీపాన విద్యుత్ లైన్‌ను బాగు చేయడానికి వెళ్లిన వేళ విద్యుదాఘాతంతో స్తంభం పైనుంచి కిందకుపడ్డాడు. నాగరాజు బడిగేర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అపోలో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. విద్యుత్‌తీగలు సరి చేస్తున్న వేళ విద్యుదాఘాతం కావడానికి కారణం బెస్కాం అధికారుల నిర్లక్ష్యమే కారణమన్న విమర్శలు వినిపించాయి. కాగా పలువురు సంతాపం తెలిపారు.